
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం : 22 : మార్చి : 2025



బెట్టింగ్ భూతం.. గెట్టింగ్ రెడీ
నేటి నుంచి ఐపీఎల్ మ్యాచ్‌లు ప్రారంభం అవుతుండగా.. బెట్టింగ్ కాసేందుకు పలువురు సిద్ధమవుతున్నారు. 8లో



రంజాన్ వేళలు
ఇఫ్తార్ (శనివారం సా) 6.26
సహర్ (ఆదివారం ఉ) 4.54

వాతావరణం
గరిష్టం / కనిష్టం 36° / 23°
జిల్లాలో శనివారం సాధారణ ఉష్ణోగ్రత నమోదవుతుంది. తెల్లవారుజామున, రాత్రి వాతావరణం చల్లగా మారుతుంది.

న్యూస్‌రీల్

స్వర్ణకవచాలంకరణలో రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపం లో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహ వచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శుక్రవారాన్ని పురస్కరించుకుని శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పెద్దమ్మతల్లికి వైభవంగా పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి శుక్రవారం వైభవంగా పంచామృతాభిషేకం చేశారు. అమ్మవారి జన్మస్థలం వద్ద పసుపు, కుంకుమ, గాజులు, చీర, సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం కుంకుమపూజ, గణపతి హోమం నిర్వహించిన అర్చకులు నివేదన, పంచహారతులు సమర్పించారు. ఆ తర్వాత నీరాజన మంత్రపుష్పం పఠించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్, ఎస్పీని కలిసిన సింగరేణి డైరెక్టర్లు

సింగరేణి(కొత్తగూడెం) : కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు‌ను సింగరేణి డైరెక్టర్లు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. డైరెక్టర్(పీపీ అండ్ పా) కె.వెంకటేశ్వర్లు, డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణ వారిని పుష్పగుచ్ఛాలు అందించారు. కార్యక్రమంలో జీఎంలు ఎస్.రాధాకృష్ణ, చంద్ర లక్ష్మీనారాయణ, ఎస్టేటుజీఎం వేణుమాధవ్, తాళ్లూరియా, డి.నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పర్చుకోవాలి

సుజాతనగర్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పర్చుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి అన్నారు. మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో శుక్రవారం జరిగిన న్యాయ అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. ఉన్నత లక్ష్యాలతోనే మంచి భవిష్యత్ ఏర్పడుతుందన్నారు. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. అంతకుముందు హాస్టల్‌లో అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బ్యూలారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చండ్రుగొండ మండలంలో ఓ డెయిరీ ఫామ్ విషయంలో భాగస్వాముల మధ్య చోటుచేసుకున్న వివాదం ఈనెల 16న అర్ధరాత్రి హైడ్రామాకు తావిచ్చింది. డెయిరీలో నుంచి పశువులను తరలించేందుకు మునుగులు ధరించిన వ్యక్తులు గుంపులుగా ఫామ్ వద్దకు వచ్చారు. ఈ విషయం బయటకు పొక్కడంతో పశువుల తరలింపు ఆగిపోయింది.

లారీలో హైదరాబాద్‌కు అక్రమంగా పశువులను తరలిస్తుండగా ఈనెల 20న పాల్వంచ పోలీసులు నవభారత్ వద్ద పట్టుకున్నారు. సామర్థ్యానికి మించి పశువులు వాహనంలో కుక్కడంతో పట్టుబడే సమయానికి కొన్ని పశువులు రక్తమోడుతున్నాయి. ఇవి బయటకు వచ్చిన ఒకటి రెండు ఘటనలే.. కానీ ప్రతీ రోజు వదుల సంఖ్యలో వాహనాల్లో వందల సంఖ్యలో మూగ జీవాలకు బతికుండానే నరకం చూపిస్తున్నారు.



బతికుండగానే నరకం!

నిబంధనలకు విరుద్ధంగా పశువుల రవాణా

- కుక్కివేయడంతో మూగజీవాలకు తీవ్ర గాయాలు
- యథేచ్ఛగా సాగుతున్న స్మగ్లింగ్
- జిల్లా మీదుగా అక్రమ తరలింపు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: డెయిరీ ఫామైనా, కబేళాకైనా సరే పశువులను తరలించేందుకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయి. అందులో నిబంధనలు మేరకే వాటిని తరలించాలి. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు అలా లేవు. మూగ జీవాల పట్ల కనీస కనికరం, కారుణ్యం లేకుండా దుర్భర, దారుణ పరిస్థితుల మధ్య వాహనాల్లో కుక్కి రవాణా చేస్తున్నారు. ఈ తరహా అక్రమ రవాణా జిల్లా మీదుగానే ఎక్కువగా సాగుతోంది.

కిక్కిరిసి.. రక్తమోడుతూ..

16 ఏళ్లు నిండిన జంతువులనే కబేళాలకు తరలించాలనే నిబంధనలు ఉన్నా.. అక్రమార్కులు వాటిని తుంగలో తొక్కుతున్నారు. రవాణా అవుతున్న ఆవుల్లో 90 శాతం వట్టిపోయేవే ఉంటున్నాయి. కొంత రైతే దూడలను సైతం కబేళాలకు తరలిస్తున్నారు. ఒక డీసీఎంలో ఆరు పశువులను తరలించాల్సి ఉండగా.. డీసీఎంలో ఒకదానిపై మరొకటిగా చెక్కలతో అరలుగా ఏర్పాటు చేసి 20 నుంచి 60 వరకు కుక్కి మరీ తరలిస్తున్నారు. దీంతో ఒక్కటికి తట్టుకోలేక పశువులు తీవ్రంగా గాయపడుతున్నాయి.



పశువులను ఒకదానిపై ఒకటి కుక్కి తరలిస్తున్న దృశ్యం

తనిఖీల్లో పట్టుబడే సమయానికే కాళ్లు, మెడ, తల భాగాలలో తీవ్ర గాయాలతో రక్తమోడుతున్న స్థితిలో ఉంటున్నాయి. గురువారం పాల్వంచలో పట్టుబడిన లారీలోనూ పశువులు తీవ్రంగా గాయపడి ఉన్నాయి.

అడ్డూ అదుపు లేని దందా..

జిల్లాకు సరిహద్దులో ఛత్తీస్‌గఢ్, ఏపీ రాష్ట్రాలు ఉన్నాయి. ఈ రెండింటితో పాటు ఒడిశాలోనూ పశువులను ఎక్కువగా కొనుగోలు చేసిన లేదా ఎత్తుకొచ్చిన పశువులను హైదరాబాద్‌కు తరలించే పనిని కొన్ని ముఠాలు జిల్లా కేంద్రంగా కొనసాగిస్తూ చేపడుతున్నాయి. వివిధ మార్గాల్లో సేకరించిన పశువులను ఒక చోట చేర్చి ఆ తర్వాత సమయం చూసుకుని వాహనాల్లో కుక్కి తరలిస్తున్నారు. తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో చర్ల మండలంలో తాలిపేరు బ్యాక్ వాటర్ ఏరియాను అడ్డాగా చేసుకున్న కొన్ని ముఠాలు అడ్డూ అదుపు లేకుండా దందా సాగిస్తున్నాయి.

నిబంధనలు ఇలా..

జంతుహింస 1960 చట్టం ప్రకారం.. పదహారేళ్ల వయసు దాటి.. బ్రీడ్ డెవలప్‌మెంట్‌కు, ఆటు వ్యవసాయానికి పనికి రాదని వెటర్నరీ డాక్టర్ సర్టిఫికెట్ ఇచ్చిన పశువులనే కబేళాలకు తరలించాలి. ఒక లారీలో ఆరు పశువులను మించి రవాణా చేయకూడదు. రవాణా సమయంలో పశువుల సంరక్షణకు ప్రత్యేకంగా ఒక వ్యక్తిని నియమించాలి. మార్గమధ్యంలో వాటికి కావాల్సిన ఆహారం, నీళ్లు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలి. రవాణా చేస్తుండగా పశువులు చనిపోతే అందుకు బాధ్యులైన వ్యక్తులకు ఐపీసీ 429 ప్రకారం రెండు నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉంది.

అక్రమ రవాణాకు మార్గాలివే..

అశ్వారావుపేట – ఖమ్మం – హైదరాబాద్, చర్ల – భద్రాచలం– కొత్తగూడెం – ఖమ్మం – హైదరాబాద్ మార్గాల్లో పశువుల అక్రమ రవాణా ఎక్కువగా సాగుతోంది. ఈ మార్గంలో నిఘా ఎక్కువగా ఉంటే చర్ల దగ్గర గోదావరి నది దాటించి మణుగూరు – తాళ్ళాయి – వరంగల్ మీదుగా రాష్ట్ర రాజధానికి తరలిస్తున్నారు. గంజాయి, కలప అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపుతున్న వివిధ ప్రభుత్వ విభాగాలు పశువుల అక్రమ రవాణాపై కూడా కఠినంగా వ్యవహరించాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు.

‘రోయింగ్’ శిక్షణ షురూ..

- తుమ్మలచెరువులో సందడే సందడి..
- ఈనెల 26 వరకు కొనసాగనున్న ట్రైనింగ్



రోయింగ్ వాటర్ స్పోర్ట్స్‌లో శిక్షణ ఇస్తున్న దృశ్యం

అశ్వాపురం: మండల పరిధిలో కాకతీయుల కాలంలో నిర్మించిన తుమ్మలచెరువులో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో రోయింగ్ వాటర్ స్పోర్ట్స్ శిక్షణ ఇస్తున్నారు. శుక్రవారం ప్రారంభమైన ఈ శిక్షణ ఈనెల 26 వరకు కొనసాగనుంది. రాష్ట్రంలో ప్రస్తుతం హైదరాబాద్ హుస్సేన్‌సాగర్‌లో మాత్రమే ఈ శిక్షణ ఇస్తున్నారు. అయితే తుమ్మలచెరువు 2 నుంచి 3 కిలోమీటర్ల పొడవు, 800 మీటర్లకు పైగా వెడల్పుతో నీరు నిలకడగా ఉంటుండడంతో ఈ శిక్షణకు అనుకూలంగా ఉంటుందని ఇక్కడ ప్రయోగాత్మకంగా ప్రారంభించారు.

బోటింగ్‌తో గుర్తింపు..

గత జనవరిలో ప్రారంభించిన బోటింగ్‌తో తుమ్మలచెరువుకు ప్రత్యేక గుర్తింపు వచ్చింది. దీన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రత్యేక చొరవ చూపించగా స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బోటింగ్ ప్రారంభించారు. మొదట 10 నుంచి 15 మంది మాత్రమే బోట్ షికారు చేయగా ప్రస్తుతం రోజుకు 100 నుంచి 150 మంది బోట్ ఎక్కుతున్నారు. గ్రామానికి చెందిన ద్వారా మహిళలు దీన్ని నిర్వహిస్తున్నారు.

యువతకు ఉచిత శిక్షణ..

జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి పరంధామరెడ్డి ఆధ్వర్యంలో తుమ్మలచెరువు వద్ద అంతర్జాతీయ రోయింగ్ క్రీడాకారుడు యలమంచిలి కిరణ్ గిరిజన యువతకు ఉచితంగా రోయింగ్ వాటర్ స్పోర్ట్స్ శిక్షణ ఇస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో క్రీడల్లో నైపుణ్యంగా రాణించే గిరిజన యువత రోయింగ్ వాటర్ స్పోర్ట్స్‌లోనూ ప్రతిభ చాటే అవకాశం ఉంది. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో పోటీలు ఉంటాయి. పురుషుల్లో లైట్ వెయిట్(68–72.5 కేజీలు), ఓపెన్ వెయిట్ (72.5 పైన), స్త్రీలలో లైట్ వెయిట్(57–59), ఓపెన్ వెయిట్ (62.5 పైన) విభాగాల్లో స్వీప్ రోయింగ్, స్కల్ రోయింగ్ ఉంటాయి. సింగిల్ స్కల్, డబుల్ స్కల్, క్వార్డబుల్ స్కల్, స్వీప్ రోయింగ్‌లో పెయిర్ (ఇద్దరు), కాక్స్‌లెస్(నలుగురు), కాక్స్‌డ్ యిట్ (ఎనిమిది మంది) పోటీలు ఉంటాయి. ఇక్కడ శిక్షణ పొందిన వారికి హుస్సేన్‌సాగర్‌లో ఓపెన్ ట్రైల్స్ నిర్వహించి పోటీలకు ఎంపిక చేస్తారు.

అడవులను పరిరక్షిద్దాం

5కే రన్ ప్రారంభోత్సవంలో డీఎఫ్ఓ కిష్టాగౌడ్

మంచుపల్లి: నిత్యం ఆరోగ్యంగా ఉంటూ అడవులను రక్షిద్దామని జిల్లా అటవీ శాఖ అధికారి కిష్టాగౌడ్ అన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆ శాఖ సిబ్బందికి నిర్వహించిన 5కే రన్‌ను స్థానిక ప్రకాశం స్టేడియం వద్ద ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అటవీ సిబ్బంది నిత్యం పని ఒత్తిడికి లోనవుతుంటారని, ఎప్పటికప్పుడు ఆరోగ్య సమస్యలను అధిగమించేందుకు అవసరమైన వ్యాయామం చేయాలని సూచించారు. ఆరోగ్యంపై అశ్రద్ధ వహించొద్దని అన్నారు. మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంటేనే విధుల్లో రాణిస్తామని చెప్పారు. జిల్లాలో అడవుల సంరక్షణకు సిబ్బంది చేస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నారు. వేసవిలో జంతువుల రక్షణకు చర్యలు చేపట్టాలని, అగ్ని ప్రమాదాల నివారణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సిబ్బంది సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కొత్తగూడెం ఎఫ్‌డీఓ యు. కోటేశ్వరరావు, రేంజ్ అధికారులు శ్రీనివాసరావు, ప్రసాదరావు, ఎల్లయ్య, ముక్తార్ హుస్సేన్, రామవరం రేంజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



5 కే రన్‌ను ప్రారంభిస్తున్న డీఎఫ్ఓ కిష్టాగౌడ్

పోడు సాగు జరగకుండా చర్యలు..

పాల్వంచరూరల్ : అడవుల సంరక్షణకు ప్రతీ ఒక్కరు సహకరించాలని, పోడుసాగును అరికట్టాలని డీఎఫ్ఓ కిష్టాగౌడ్ అన్నారు. స్థానిక డిపోలో రియల్ డివిజన్ కార్యాలయంలో ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లా అటవీ భూముల్లో పోడు సాగు చేయకుండా సిబ్బంది కృషి చేయాలని సూచించారు. అడవుల సంరక్షణను గురికాకుండా మొక్కలని, మొక్కలను విరివిగా పెంచాలని, వన సంరక్షణే ధ్యేయంగా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఎఫ్ఓలు కట్టా దామోదర్‌రెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

కలెక్టర్ జితేష్ వి పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలకు ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు మతసామరస్యానికి ప్రతీక అని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లోని ముస్లిం ఉద్యోగులకు నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ముస్లింలు భక్తి శ్రద్ధలతో ఉపవాస దీక్షలు చేస్తారని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రజల్లో సోదర భావాన్ని పెంపొందిస్తాయని చెప్పారు. ఈ సందర్భంగా ఉద్యోగులు కలెక్టర్‌కు ఖురాన్‌ను బహూకరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, సీపీఓ సంజీవరావు, డీఎంహెచ్ అజ్గర్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు ఖురాన్ బహూకరిస్తున్న ముస్లిం ఉద్యోగులు

నర్సింగ్ వసతిగృహం పరిశీలన..

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం ప్రభుత్వ నర్సింగ్ కళాశాల వసతి గృహాన్ని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ శుక్రవారం పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాలపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ.. మొత్తం 140 మంది విద్యార్థులకు కలిపి ఒకటే పెద్ద హాలు ఉందని, గదులను పార్టిషన్ చేయాలని అధికారులను ఆదేశించారు. హాల్‌లో వేడి ఎక్కువగా ఉన్నందున థర్మాకోల్‌తో సీలింగ్ ఏర్పాటు ఏర్పాటు చేయాలని అన్నారు. గదుల్లో విశాలమైన కూలర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. తాగునీటి ఫ్రిజ్ ను ఏర్పాటు చేయాలన్నారు. ప్రహరీ గోడకు ఆనుకొని షెడ్ వేసి ఎత్తు పెంచాలని చెప్పారు. విద్యార్థినులకు నాణ్యమైన భోజనం, శుద్ధ జలం అందించాలని వార్డెన్‌కు సూచించారు.

ప్రతీ మనిషికి 100 లీటర్లు

- వేసవిలోనూ సాఫీగా నీటి సరఫరా
- గతేడాదితో పోలిస్తే 20శాతం అధికంగా నీరు
- పైపులైన్ లేనిచోట్ల ప్రత్యామ్నాయ మార్గాలు
- మిషన్ భగీరథ ఎస్ఈ గడ్డం శేఖర్‌రెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: ఎండలు ముదురుతున్న నేపథ్యాన ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో తాగునీటికి ఇక్కట్లు ఎదురుకాకుండా ప్రణాళికాయుతంగా వ్యవహరిస్తున్నట్లు మిషన్ భగీరథ ఎస్ఈ గడ్డం శేఖర్‌రెడ్డి వెల్లడించారు. వచ్చే ఏప్రిల్, మే, జూన్ నెలల్లోనూ నిరంతరాయంగా స్వచ్ఛమైన తాగునీరు అందించేలా తమ శాఖ అధికారులు, సిబ్బంది ఇప్పటికే సమాయత్తమయ్యారని తెలిపారు. కొద్ది రోజుల క్రితం మంత్రి సీతక్క నేతృత్వాన హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో చేసిన సూచనల మేరకు గత నెలలోనే ముందస్తుగా క్షేత్రస్థాయిలో పరిశీలించామన్నారు. మిషన్ భగీరథ ఎస్ఈగా ఖమ్మంలో బాధ్యతలు స్వీకరించిన ఆయన వేసవి సన్నద్ధతపై ‘సాక్షి’కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలు వెల్లడించారు. అవి ఆయన మాటల్లోనే..

22గ్రామాలకు స్థానిక వనరులతో..

ఖమ్మం జిల్లాలో 931 గ్రామాలకు గాను ఏడు గ్రామాలకు మిషన్ భగీరథ పథకం ద్వారా కాకుండా స్థానిక వనరులతో నీరు అందిస్తున్నాం. అలాగే, భద్రాద్రి జిల్లాలోని 1,599 గ్రామాలకు గాను 15 గ్రామాల్లో స్థానికంగానే నీరు సమకూరుస్తున్నాం.

వేసవికి ప్రత్యేక ప్రణాళిక

వేసవిని సమర్థంగా ఎదుర్కొనేందుకు నెల రోజులుగా ప్రణాళికలు సిద్ధం చేశాం. గత నెలలోనే ఉద్యోగులంతా పది రోజుల పాటు క్షేత్రస్థాయిలో పర్యటించి ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో గుర్తించారు. ఆయా ఆవాసాల్లో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీటి సరఫరాకు అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకోనున్నాం.

జోన్లుగా గ్రామాల విభజన

ఉమ్మడి జిల్లాలో ప్రతీ మనిషికి 100 లీటర్ల తాగునీరు అందించాలనేది లక్ష్యం. ఈ స్థాయిలో నీరు అందుతున్న గ్రామాలను గ్రీన్ జోన్‌గా గుర్తించాం. ఇక 55 – 100 లీటర్లు అందించే గ్రామాలను ఎల్లో జోన్‌గా, 20 – 55 లీటర్లు అందించే గ్రామాలను ఎల్లో జోన్‌గా, 20లీటర్ల కంటే తక్కువ సరఫరా అవుతున్న గ్రామాలను రెడ్‌జోన్‌గా విభజించాం. అయితే, గతేడాదితో పోలిస్తే ఇప్పటికైతే 20 శాతం నీరు అధికంగానే ఉంది. మిషన్ భగీరథ పైప్‌లైన్ ఉన్న గ్రామాలకు గ్రిడ్ ద్వారా, లేనిచోట్లలో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీరు సరఫరా చేస్తున్నాం.



గడ్డం శేఖర్‌రెడ్డి

మారుమూల పల్లెలకు సైతం..

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని మారుమూల పల్లెల్లోనూ ఇప్పటికే స్థానికంగా ఉన్న వనరుల ద్వారా నీరు సరఫరా చేస్తున్నాం. ఆదివాసీ గూడెల్లో సైతం బోర్లు వేసి సోలార్ ప్యానల్ల ద్వారా నిరంతరాయంగా నీరు అందిస్తున్నాం.

‘పది’ పరీక్షలు షురూ..



కొత్తగూడెంలోని ఓ పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్



పాల్వంచరూరల్: విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

- జిల్లాలో 99 శాతం హాజరు నమోదు
- పటిష్ట పోలీస్ బందోబస్తు..
- కేంద్రాల్లో అవసరమైన వసతులు కల్పించాలని కలెక్టర్ ఆదేశం

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో పదో తరగతి పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు 99 శాతం మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. జిల్లాలోని 73 కేంద్రాల్లో 12,269 మంది విద్యార్థులకు గాను 12,235 మంది హాజరు కాగా, 34 మంది గైర్హాజరయ్యారు. ప్రైవేట్ విద్యార్థులు 25 మందికి 18 మంది హాజరయ్యారు. అన్ని కేంద్రాల్లోనూ విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేశాకే లోపలికి పంపించారు. కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. విద్యార్థులు అనారోగ్యానికి గురైతే ప్రథమ చికిత్స అందించేందుకు ప్రతీ కేంద్రంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు విధులు నిర్వర్తించారు. పరీక్ష కేంద్రాల వద్దకు విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు భారీగా చేరుకోవడంతో సందడి వాతావరణం కనిపించింది. మొదటి రోజున ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాకుండా ప్రశాంతంగా జరిగాయి. పరీక్ష అనంతరం పోలీసు బందోబస్తు నడుమ సమాధాన పత్రాలను పోస్టాఫీసులకు తరలించారు. ఇక పాత కొత్తగూడెంలోని తెలంగాణ స్కూల్‌కు సంబంధించిన విద్యార్థుల హాల్ టికెట్లపై గతేడాది లాగే ఆనందఖని పాఠశాల అని పేర్కొనడం, కొన్ని ప్రైవేట్ స్కూళ్లకు బయట ఒక బోర్డు, హాల్ టికెట్లపై మరో పేరు ఉండడంతో ఆయా విద్యార్థులు, తల్లిదండ్రులు కొంత ఆందోళనకు గురయ్యారు. ఆ తర్వాత అక్కడి సిబ్బంది అడిగి సందేహాలు నివృత్తి చేసుకున్నారు. ఇక పరీక్ష సమయానికంటే ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చినా అనుమతిస్తామని అధికారులు ముందే ప్రకటించినప్పటికీ.. విద్యార్థులంతా ముందుగానే ఆయా కేంద్రాల వద్దకు చేరుకోవడం విశేషం.



పాల్వంచ : బొల్లేరుగూడెం పాఠశాల కేంద్రం వద్ద విద్యార్థుల కోలాహలం..

అధికారులు, స్క్వాడ్ బృందాలు తనిఖీ..

జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాలను స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశాయి. కొత్తగూడెంలోని లిటిల్ ఫ్లవర్, పాల్వంచ కేటీపీఎస్ కాలనీలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల కేంద్రాలను కలెక్టర్ జితేష్ వి పాటిల్ తనిఖీ చేశారు. డీఈఓ వెంకటేశ్వరాచారి ఏడు కేంద్రాలను తనిఖీ చేయగా మిగతా కేంద్రాలను ఇతర అధికారులు పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన వసతులపై కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వసతులు కల్పనపై పలు సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద శుభ్రంగా ఉంచాలని, విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసేలా తగిన వసతులు కల్పించాలని సూచించారు.

పరీక్షల్లో కొన్ని ఘటనలు..



విద్యార్థినులను బైక్‌పై పరీక్ష కేంద్రం వద్దకు తీసుకెళ్తున్న ఎస్సై రాజేందర్

కరకగూడెం: మండల పరిధిలోని భట్టుపల్లి పాఠశాలకు చెందిన ఓ ఇద్దరు విద్యార్థినులు పరీక్ష కేంద్రానికి మండల కేంద్రం నుంచి కాలినడకన వెళ్తుంటే అటువైపుగా వెళ్తున్న ఎస్సై రాజేందర్ వారిని తన బైక్‌పై ఎక్కించుకున్నారు. ఆలస్యం కాకుండా పరీక్ష కేంద్రం వరకు తీసుకెళ్లారు.

ములకలపల్లి: స్థానిక జెడ్పీ హైస్కూల్ కేంద్రంలో గేట్ బయట విద్యార్థుల గదుల కేటాయింపు వివరాలతో కూడిన నోటీసు బోర్డు ఏర్పాటు చేయలేదు. దీంతో విద్యార్థులు ఆయోమయానికి గురయ్యారు. ఉదయం 8.45 తరువాత పరీక్ష కేంద్రం ఆవరణలోకి అనుమతించడం, 8.50కి గదుల్లోకి ప్రవేశించడంతో విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.

క్లుప్తంగా

వన్యప్రాణులు అడవి దాటి రాకుండా చర్యలు

ఎఫ్‌డీఓ కోటేశ్వరరావు



వివరాలు వెల్లడిస్తున్న ఎఫ్‌డీఓ కోటేశ్వరరావు

చండ్రుగొండ : వేసవి ఎండలు మండుతున్న నేపథ్యంలో దాహార్తి తీర్చుకునేందుకు వన్యప్రాణులు అటవీ ప్రాంతం నుంచి బయటకు రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కొత్తగూడెం ఎఫ్‌డీఓ కోటేశ్వరరావు తెలిపారు. చండ్రుగొండలోని రేంజ్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జంతువుల దాహార్తి తీర్చుకునేందుకు అడవుల్లో నీటి గుంటలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. బీట్ అధికారులు, బేస్‌క్యాంప్ సిబ్బంది, 50 సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. సీసీ కెమెరాల ద్వారా వన్యప్రాణుల వేటకు వచ్చిన ఇద్దరిని గుర్తించి అరెస్టు చేశామన్నారు. డివిజన్ పరిధిలో 500 ఎకరాల్లో కొత్తగా ప్లాంటేషన్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అగ్నిప్రమాదాలు జరగకుండా ఐదు మీటర్ల విస్తీర్ణంలో ఫైర్‌లైన్‌లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రేంజర్ ఎల్లయ్య పాల్గొన్నారు.

ముగిసిన జాతరలు



గోవిందరాజు జాతరకు హాజరైన భక్తులు

గుండాల: మూడు రోజులుగా అంగరంగ వైభవంగా సాగుతున్న గోవిందరాజు, దూలుగొండ జాతరలు శుక్రవారంతో ముగిశాయి. మండలంలోని చెట్టుపల్లిలో సనప వంశీయుల ఇలవేల్పు అయిన గోవిందరాజు, రోళ్లగడ్డ దూలుగొండ దేవత జాతరల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారు జాము వరకు డోలీ చప్పుళ్ల నడుమ నృత్యాలు చేశారు. ఆయా దేవతలను గుట్టకు తరలించడంతో జాతరలు ముగిశాయి.

గిరిజన గురుకులంలో తాగునీటి పాట్లు



తాగునీరు మోసుకెళ్తున్న విద్యార్థులు

పాల్వంచరూరల్: మండల పరిధిలోని కిన్నెరసాని డ్యామ్ సైడ్‌లో ఉన్న గిరిజన గురుకుల పాఠశాలలో ఆర్‌ఓఆర్ వాటర్ ప్లాంట్ మరమ్మతులకు గురైంది. దీంతో విద్యార్థులు తాగునీళ్ల కోసం పాఠశాల నుంచి కళాశాలకు వస్తున్నారు. చిన్నారులు పెద్ద క్యాన్లలో పట్టుకుని సుమారు అరకిలోమీటర్ దూరం మోయాల్సివస్తోంది. సిబ్బంది ఉన్నా తాగునీళ్లు విద్యార్థులే తెచ్చుకుంటూ ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామ్‌కుమార్‌ను వివరణ కోరగా.. ఆర్‌ఓఆర్ ప్లాంట్ మరమ్మతులకు గురైందని, బాగు చేసేందుకు మెకానిక్‌ను పిలిస్తే రావడం లేదని తెలిపారు. దీంతో విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో ఉన్న ప్లాంట్ నుంచి తాగునీరు తెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు.

గంజాయి సీజ్


భద్రాచలంఅర్బన్: ద్విచక్రవాహనంపై అక్రమంగా తరలిస్తున్న గంజాయిని శుక్రవారం పట్టణంలోని బ్రిడ్జి సెంటర్‌లో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని సీలేరు నుంచి ద్విచక్రవాహనంపై రెండు కిలోల గంజాయిని ఇద్దరు వ్యక్తులు తీసుకెళ్తుండగా వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు పట్టుకున్నారు. నిందితులు, ఖమ్మం జిల్లా వైరాకు చెందిన సమీర్, రామకృష్ణలను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,871

బెట్టింగ్ భూతం.. గెట్టింగ్ రెడీ!



నేటి నుంచి ప్రారంభంకానున్న ఐపీఎల్ మే నెల 25వ తేదీన ముగియనుంది. దీంతో ఎప్పటిలాగే బెట్టింగ్ మాఫియా సిద్ధమవుతోంది. క్రికెట్ బుకీలు క్రీడాభిమానులను ఊబిలోకి దింపి సొమ్ము చేసుకునేందుకు రెడీ అవుతున్నారు. ప్రతీసారి జిల్లాలో పలుచోట్ల బెట్టింగ్ వ్యవహారం గుట్టుగా సాగిస్తున్నారు. ఇరువర్గాలను ఫోన్ ద్వారా కాంటాక్ట్ చేసి బెట్టింగ్ పెట్టించి, గెలిచిన వారి నుంచి కమీషన్ పొందుతున్నారు. పట్టణాలు, పల్లెల్లోని యువకులను టార్గెట్ చేస్తున్నారు. క్రికెట్ బెట్టింగ్‌తో జిల్లాలోని కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు, ఇల్లెందు, భద్రాచలం, సారపాక తదితర ప్రాంతాల్లోని పలువురు యువకులు ఆర్థికంగా నష్టపోయి అప్పుల పాలైన సంఘటనలు కూడా ఉన్నాయి.

–పాల్వంచరూరల్/భద్రాచలంఅర్బన్

పోలీసులు నిఘా పెంచితే మేలు

- నేటి నుంచి ఐపీఎల్ మ్యాచ్‌లు ప్రారంభం
- బెట్టింగ్‌లకు సిద్ధమవుతున్న కొందరు యువకులు
- క్రీడాసక్తిని సొమ్ము చేసుకునే పనిలో బుకీలు

'స్మార్ట్'గా పందేలు

బెట్టింగ్ వ్యవహారం అంతా ఆన్‌లైన్, స్మార్ట్‌ఫోన్ యాప్‌ల ద్వారానే సాగుతోంది. ఎస్, నో, ఓకే, డన్, ఈటింగ్ వంటి కోడ్ లాంగ్వేజీని వాడుతుంటారు. చాలా మంది టీవీలు చూస్తూనే పందేలు కాస్తుంటారు. గ్రౌండ్లో చూసే ఆటకు, టీవీల్లో చూసే వారికి కనీసం రెండు బంతుల సమయం తేడా ఉంటుంది. బంతి బంతికి ఆట ఎలా ఉంటుందో ముందే తెలుసుకుని బెట్టింగ్ వేసే వారి జేబులను బుకీలు గుల్ల చేస్తున్నారు. జిల్లాలో కొందరు కమీషన్లకు కక్కుర్తిపడి రహస్యంగా బెట్టింగ్‌లను ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తోంది.

బాల్ బాల్‌కూ..

మ్యాచ్ ప్రారంభానికి ముందుకు ఓ జట్టుపై రూ.1000 బెట్టింగ్ పెడితే, ఆ జట్టు గెలుపొందితే రెండింతల సొమ్ము మరుసటి రోజు అకౌంట్‌లో జమ చేస్తారు. టాస్ వేసే సమయం నుంచి.. బ్యాటింగ్ ఎవరు ఎంచుకొంటారు, బౌలింగ్ ఎవరు చేస్తారు, ఎవరు ఎన్ని పరుగులు చేస్తారు, నిర్దేశిత బాల్‌కు ఎన్ని పరుగులు వస్తాయి, సిక్స్ కొడతారా, మరో బాల్‌కు అవుట్ అవుతాడు, ఎన్ని పరుగులతో మ్యాచ్ పూర్తవుతుంది... ఇలా బెట్టింగ్‌లు సాగుతాయి.

గతంలో కేసులు నమోదు..

గత ఐపీఎల్–2024 సీజన్‌లో కూడా రూ.లక్షల్లో బెట్టింగ్ పెట్టి పలువురు ఆర్థికంగా నష్టపోయారు. పాల్వంచ పట్టణంలో ఓ యువకుడు పెళ్లికి ఇచ్చిన కట్నం డబ్బులతో బెట్టింగ్ పెట్టి నష్టపోయాడు. దీంతో భార్యాభర్తలు విడిపోయే పరిస్థితి దారితీసింది. కొందరు యువకులు, విద్యార్థులు వివిధ యాప్‌ల్లో రుణం తీసుకుని అప్పులపాలై ఇల్లు వదలి వెళ్లిన వారు ఉన్నారు. పాల్వంచ మండలం నాగారంలో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తుండగా పోలీసులు దాడి చేసి నిర్వాహకులను పట్టుకున్నారు. ఇల్లెందు ఏరియాలో 8 మందిపై కేసు నమోదు చేశారు. రుద్రంపూర్ ఏరియాలో ఐదుగురిపై కేసు, రామవరంలో ముగ్గురిని బెట్టింగ్ దారులను పోలీసులు పట్టుకుని కేసులు పెట్టారు. ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు పూర్తయ్యేవరకు రెస్టారెంట్లు, బార్‌షాపులు, హోటల్స్ తదితర ప్రదేశాల్లో బెట్టింగ్‌లు నిర్వహించే అవకాశం ఉందని, ఆయా ప్రాంతాల్లో పోలీసులు నిఘా పెట్టాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు తప్పవు



క్రికెట్‌పై ఇష్టం ఉంటే చూడాలే తప్ప బెట్టింగ్‌లకు పాల్పడొద్దు. బెట్టింగ్‌కు పాల్పడివారు ఆర్థికంగా దెబ్బతిని ఆత్మహత్య చేసుకుని ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉంది. యువత దీనికి దూరంగా ఉండాలి. నేటి నుంచి ఐపీఎల్ జరుగుతున్న నేపథ్యంలో నిఘా పటిష్టం చేశాం. ఎవరైనా బెట్టింగ్‌కు పాల్పడితే డయల్100కు, పోలీసులకు సమాచారం ఇవ్వాలి. కఠిన చర్యలు తీసుకుంటాం.

–విక్రాంత్ కుమార్ సింగ్, భద్రాచలం ఏఎస్పీ

ఆర్థికంగా నష్టపోవద్దు



దురాశతో బెట్టింగ్‌లు పెట్టి ఆర్థికంగా నష్టపోవద్దు. క్రికెట్ ఆట వినోదం కోసమే చూడాలి. బెట్టింగ్ వల్ల ఆర్థికంగా నష్టపోవడమేకాకుండా కుటుంబాలు కూడా దెబ్బతింటాయి. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను బెట్టింగ్‌లకు పాల్పడకుండా ఓ కంట కనిపెట్టాలి. బెట్టింగ్ నిర్వాహకులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. ఐపీఎల్ సీజన్ పూర్తయ్యేవరకు నిఘా పెంచుతాం.

–సతీష్, పాల్వంచ సీఐ

రూ. 1.25 కోట్లు పలికిన ఆశీలు

వేలంపాట నిర్వహించిన పంచాయతీ అధికారులు



భద్రాచలం గ్రామ పంచాయతీలో వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఆశీలు (పార్కింగ్), సంత, గోదావరి ఫెర్రీ, పంచాయతీ దుకాణాలకు శుక్రవారం వేలం పాట నిర్వహించారు. డీఎల్పీఓ సుధీర్, గ్రామ పంచాయతీ అధికారి శ్రీనివాస్ సమక్షంలో వేలంపాట నిర్వహించగా, ఆశీలు కాంట్రాక్ట్‌ను రూ.1.25 కోట్లకు పట్టణానికి చెందిన రంగా అనే వ్యక్తి దక్కించుకున్నాడు. గత ఏడాది ఇదే టెండర్ 9 నెలలకుగాను రాములు అనే వ్యక్తి రూ.79 లక్షలకు దక్కించుకున్నాడు. గోదావరి నదిలో ఉండే బోట్లు (ఫెర్రీ) గతేడాది 9 నెలలకు రూ. 16.90 పలకగా, ఈసారి ఏడాదికి గాను రూ. 27లక్షల 25 వేలు పలికింది. చర్ల రోడ్డులో నిర్వహించే వారపు సంత గతేడాది 9 నెలలకు గాను రూ.3.90 లక్షలు పలకగా, ఈ ఏడాది రూ.3.80 లక్షలకు దక్కించుకున్నారు. చర్చి రోడ్డులో ఉన్న మొదటి దుకాణం, రూ.1.45 లక్షలు, రెండో దుకాణం రూ.1.32 లక్షలు పలికాయి. బ్రిడ్జి సెంటర్‌లో పార్క్ వద్ద ఉన్న షాప్ రూ.90 వేలు పలికింది. మొత్తంగా టెండర్ ప్రక్రియ ద్వారా గ్రామ పంచాయతీకి రూ.1,59,72,200 ఆదాయం సమకూరనుంది.

మెడికల్ బోర్డ్‌లో 132 మంది అన్‌ఫిట్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ప్రధానాస్పత్రిలో గురు, శుక్రవారాల్లో జరిగిన కార్పొరేట్ మెడికల్ బోర్డులో 132 మంది ఇన్‌వాలిడేషన్ అయ్యారు. 20న వైద్య పరీక్షలకు 199 మంది రావాల్సి ఉండగా, 170 మంది హాజరయ్యారు. వారిలో 132 మంది అన్‌ఫిట్ కాగా, 9 మంది పిట్‌ఫర్ సేమ్ జాబ్‌కు, మరో 17 మంది అండర్ గ్రౌండ్ నుంచి సర్ఫేస్‌కు, మరో 12 మంది హయ్యర్ రిఫరల్‌కు మెడికల్ అధికారులు ఎంపిక చేశారు. మెడికల్ బోర్డ్‌లో ఇన్‌వాలిడేషన్ అయిన కార్మికుల వివరాలు, వారికున్న జబ్బుల వివరాలను డిస్‌ప్లే చేయాలని కార్మికులు కోరుతున్నా ఆస్పత్రి ఉన్నతాధికారులు పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వస్తున్నాయి.

సారపాక ఈఎస్‌ఐలో గలాట



ఈఎస్‌ఐలో డాక్టర్, స్థానిక నాయకులకు మధ్య వాగ్వాదం

బూర్గంపాడు: సారపాకలోని ఈఎస్ఐ డిస్పెన్సరీలో శుక్రవారం గలాట చోటుచేసుకుంది. కార్మిక కుటుంబాలకు వైద్యసేవలు అందించాల్సిన ఈఎస్ఐలో కనీసం మందుబిల్లలు కూడా లేవని పలువురు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి రోగాలకు కూడా మందులు ఇవ్వకపోవటం పట్ల వారు నిరసన వ్యక్తం చేశారు. మందులు ఎందుకు ఇవ్వటం లేదని జిల్లా దళిత హక్కుల పోరాటసమితి అధ్యక్షుడు పేరాల శ్రీనివాసరావు ప్రశ్నించగా ఈఎస్ఐ వైద్యుడు కరుణాకర్ దురుసుగా సమాధానం చెప్పటంతో గలాట మొదలైంది. మందులు కావాలంటే మీ ఎమ్మెల్యేకో, సెక్రెటరీయేట్‌కు కంప్లయింట్ చేసుకోండని డాక్టర్ దురుసుగా వ్యవహరించారని శ్రీనివాస్ ఆరోపించారు. ఈ క్రమంలో స్థానిక నాయకులు ఈఎస్ఐకి చేరుకుని వైద్యుని తీరుపై ఆందోళన చేపట్టారు. పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. కాగా వైద్యుడు తన పట్ల దురుసుగా ప్రవర్తించారని పేరాల శ్రీనివాస్ బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

అనారోగ్యంతో విద్యార్థి మృతి



సుకుమార్ (ఫైల్)

దుమ్ముగూడెం : మండలంలోని నారాయణరావు పేట బాలుర ఆశ్రమ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న పెద్దబండిరేవు గ్రామానికి చెందిన సోయం సుకుమార్ (12) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ నెల 13న జ్వరం రావడంతో మరుసటి రోజు తల్లి సుభద్ర విద్యార్థిని ఇంటికి తీసుకెళ్లింది. ఆయాసం వస్తుండటంతో ఈ నెల 17న దుమ్ముగూడెం ఆస్పత్రికి తీసుకెళ్లగా కామెర్లు ఉన్నట్టు గుర్తించిన వైద్యులు భద్రాచలం తీసుకెళ్లాలని సూచించారు. దీంతో ఏరియా ఆస్పత్రిలో చేర్చగా, వైద్యులు పరీక్షించి రక్తం ఒక శాతమే ఉన్నట్లు తేల్చారు. మూడు దఫాలుగా రక్తం ఎక్కించారు. అయినా విద్యార్థి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో వెంటిలేటర్‌పై ఉంచి వైద్యం అందిస్తున్నారు. పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. విద్యార్థి మృతిపై హెచ్‌ఎం కుంజా శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.

మునగ సాగు లాభదాయకం

- ఐదెకరాల భూమి ఉన్న రైతులకు రాయితీ
- అదనపు కలెక్టర్ విద్యాచందన



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విద్యాచందన

దమ్మపేట: మునగ పంట సాగు చిన్న, సన్నకారు రైతులకు లాభదాయకమని జిల్లా అదనపు కలెక్టర్ విద్యాచందన అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మల్లారం రైతు వేదికలో మునగ సాగుపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. మునగ సాగు ప్రారంభ దశ నుంచి తొమ్మిది నెలల లోపు ఉపాధి హామీ పథకం ద్వారా రూ.1.10 లక్షలను ప్రోత్సాహకం, రాయితీల రూపంలో ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. రాయితీకి ఐదు ఎకరాల వరకు ఉన్న చిన్న, సన్నకారు రైతులతో పాటు పదెకరాలు ఉన్న ఎస్సీ, ఎస్టీ రైతులు కూడా అర్హులేనని అన్నారు. మునగ పంట ద్వారా ఏటా ఎకరాకు రూ.లక్ష ఆదాయంపాటు మునగ ఆకుల ద్వారా మరికొంత ఆదాయం పొందవచ్చని వివరించారు. వ్యవసాయ క్షేత్రాల్లో చిన్న చెరువులను నిర్మించుకుని చేపల పెంపకం, గెదేలు, కోళ్ల ఫారం షెడ్లులు, ఇంకుడు గుంతలు నిర్మించుకుని ఉపాధి హామీ పథకం ద్వారా రాయితీలు పొందాలని సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు మాట్లాడుతూ పామాయిల్ సాగు తొలిదశలో అంతర పంటగా మునగ సాగు చేపట్టవచ్చని అన్నారు. వ్యవసాయ క్షేత్రాల్లో నీటి కుంటల నిర్మాణం వలన భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట వ్యవసాయ సహాయ సంచాలకుడు రవికుమార్, దమ్మపేట ఎంపీడీఓ రవీంద్రా రెడ్డి, అశ్వారావుపేట ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఎంపీఓ రామారావు, ఏపీఓ సుధాకర్‌రావు, పంచాయతీ కార్యదర్శి సంజీవ్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

భక్తులకు ఇక్కట్లు లేకుండా ఏర్పాట్లు

- భద్రాచలం ఆర్డీఓ దామోదర్ రావు
- శ్రీరామనవమి ఏర్పాట్లపై అధికారులతో సమావేశం



మాట్లాడుతున్న ఆర్డీఓ దామోదర్ రావు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి కల్యాణం, మహాపట్టాభిషేకం మహోత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని భద్రాచలం ఆర్డీఓ దామోదర్ రావు సూచించారు. ఏప్రిల్ 6,7 తేదీల్లో జరిగే రామయ్య కల్యాణం, పట్టాభిషేకం మహోత్సవాలకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం డివిజన్‌స్థాయి అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మిథిలా స్టేడియంలో కల్యాణ మండపాన్ని 24 సెక్టార్లుగా విభజించినట్లు తెలిపారు. భక్తులు ఒక సెక్టార్ నుంచి మరో సెక్టార్‌కు వెళ్లకుండా భారీకేడ్లు ఏర్పాటు చేయాలని, ఆన్‌లైన్‌లో లాడ్జిలు బుకింగ్, టికెట్లు విక్రయాలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పారిశుద్ధ్య సిబ్బందిని ప్రత్యేకంగా నియమిస్తామని, పారిశుద్ధ్య కార్యక్రమాల పర్యవేక్షణకు పట్టణాన్ని 25 జోన్లుగా విభజించి అధికారులను కేటాయించినట్లు వివరించారు. దాదాపు 200 తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయాలన్నారు.

రెస్క్యూ టీమ్‌లను అందుబాటులో ఉంచాలి

వాహనాల పార్కింగ్ విషయంలో కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అగ్ని ప్రమాదాల నివారణకు అగ్నిమాపక వాహనాలను ఎస్టీమ్ గిరీష్ పరికరాలను సిద్ధంగా ఉంచాలని వివరించారు. రెస్క్యూ టీములను, నాటు పడవలు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని చెప్పారు. నదిలో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. భక్తుల రద్దీ నియంత్రణకు మూడంచెల భద్రత ఏర్పాటు చేయాలని సూచించారు. అత్యవసర వైద్య కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో 20 బెడ్లను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. తలంబ్రాలు, ప్రసాదం భక్తులందరికీ అందేలా చూడాలన్నారు. పోలీసుల సహకారంతో మొబైల్ తలంబ్రాల కౌంటర్లు కూడా ఏర్పాట్లు చేయాలన్నారు. 25 సమాచార కేంద్రాలు ఏర్పాటు చేయాలని డీపీఆర్వోకు సూచించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఓ రమాదేవి, ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, తహసీల్దార్ శ్రీనివాస్, ఇరిగేషన్ ఈఈ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎండుతున్న వరి పొలం



ప్రభాత్‌నగర్ సమీపంలో పంట పొలాల వద్ద వట్టిపోయిన కిన్నెరసాని కాలువ



నీళ్లులేక ఎండిపోతున్న వరి పొలం

- ఆరు ఆయిల్ ఇంజన్లతో ఎత్తిపోస్తున్నా అందని సాగునీరు
- పొట్ట దశకు చేరిన పంట చేజారుతోందని రైతుల ఆవేదన

పాల్వంచరూరల్: ఐదు రోజులుగా ఆరు ఆయిల్ ఇంజన్లు పెట్టి నీటిని కాలువలోకి తరలిస్తున్నా పంట పొలాలకు చేరకపోవడంతో రైతులు కలవరం చెందుతున్నారు. పొట్ట దశకు చేరిన వరి పంట నీరందరక ఎండిపోతోంది. వరి మడులు నెర్రెలు వారుతున్నాయి. మండల పరిధిలోని ప్రభాత్‌నగర్‌లో కిన్నెరసాని ఎడమ కాలువ కింద మూడు వందల ఎకరాల వరకు యాసంగిలో వరి సాగుచేశారు. ఈ పొలాలకు కిన్నెరసానితోపాటు రాళ్లవాగు పికప్ డ్యామ్ నీళ్లు కూడా వస్తాయి. గత వర్షాకాలంలో అధిక వర్షాల కారణంగా రాళ్లవాగు పికప్ డ్యామ్ తూము వద్ద గండిపడి నీళ్లు వృథాగా పోయాయి. దీంతో నీటిమట్టం అడుగంటింది. దీనికితోడు కిన్నెరసాని ఎడమ కాలువ తూము వద్ద నీటిమట్టం తగ్గిపోవడంతో నీళ్లు రావడంలేదు. రైతులు సమస్యను మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే కూనంనేని, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశాలతో ఇరిగేషన్ అధికారులు ఈ నెల 17న కిన్నెరసాని వద్ద ఆరు ఆయిల్ ఇంజన్లు ఏర్పాటు చేశారు. రాత్రి పగలు నీటిని ఎడమ కాలువలోకి మళ్లిస్తున్నా ఇంతవరకు ఆ నీళ్ల కాలువ ద్వారా ఎండిపోతున్న పంటలకు చేరుకోలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

కాలువలో మట్టికట్టలు అడ్డంగా ఉన్నాయి

కిన్నెరసాని ఎడమ కాలువ తూము వద్ద ఆరు ఆయిల్ ఇంజన్లు ఏర్పాటు చేసి ఐదు రోజుల నుంచి నీటిని కాలువలోకి తరలిస్తున్నాం. కాలువలో అక్కడక్కడా మట్టికట్టలు అడ్డంగా ఉండటంతో నీటి ప్రవాహం నెమ్మదించింది. ఇప్పటివరకు మూడు కిలోమీటర్ల వరకు నీళ్లు వెళ్లాయి. రైతులు ముందుకు వచ్చి మట్టికట్టలు తొలగిస్తే ప్రవాహం పెరిగి నీళ్లు త్వరగా పొలాలకు అందుతాయి.

–చంద్రశేఖర్, ఇరిగేషన్ డీఈ

అనతికాలంలోనే అనేక విజయాలు

- ఇకపై పూర్వ వీఆర్‌ఏలు, వీఆర్వోలకు మంచి రోజులు
- ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి

ఖమ్మం సహకారనగర్: ఎన్నో చారిత్రక పోరాటాలు, జాతీయ స్థాయి ఉద్యమాలకు పురుడు పోసుకున్న ఖమ్మం వేదికగా తెలంగాణ ఉద్యోగ జేఏసీ ఆత్మీయ సమ్మేళనాలను ప్రారంభించడం సంతోషంగా ఉందని తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి తెలిపారు. ఖమ్మంలో శుక్రవారం నిర్వహించిన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల స్థాయి రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు, సీఎస్ సహకారంతో అనేక విజయాలు సొంతమయ్యాయని చెప్పారు. సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల పోస్టుల సాధన, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల పోస్టుల సంఖ్య పెంపు, గ్రామానికో అధికారి నియామకం సహా పూర్వ వీఆర్‌ఏ, వీఆర్వోలను మాతృశాఖలోకి తీసుకోవడం వంటి విజయాలు సాధించామని తెలిపారు. ఇదే స్ఫూర్తితో మిగతా సమస్యలను కూడా ప్రభుత్వ సహకారంతో పరిష్కరించుకుంటామని చెప్పారు. ఈసమావేశంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, టీజీటీఏ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎస్.రాములు, పాక రమేష్‌తో పాటు వివిధ సంఘాల బాధ్యులు పూల్‌సింగ్ చౌహాన్, నరసింహారావు మంగీలాల్, తూమాటి శ్రీనివాస్, కోట రవికుమార్, అశోక్‌కుమార్, భద్రునాయక్, గుండు రాజు, జాదవ్ మాణిక్యరావు, ప్రతాప్, అభిరామ్, మురళి, బాణాల రాంరెడ్డి, వి.భిక్షం, గరికె ఉపేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బీట్ ఆఫీసర్‌కు గాయాలు



చికిత్స పొందుతున్న ఎర్రయ్య

అశ్వాపురం: మండల పరిధిలోని చింతిర్యాల ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పద్దం ఎర్రయ్యకు బూర్గంపాడు మండలం సారపాక పుష్కర్ ఘాట్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. బీట్ ఆఫీసర్ ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా పుష్కర్ ఘాట్ వద్ద జామాయిల్ లోడ్‌తో ఉన్న ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో గాయపడగా చికిత్స నిమిత్తం భద్రాచలం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా హెల్మెట్ ధరించి ఉండటంతో ప్రాణాపాయం తప్పింది.

రెండు బైక్‌లు ఢీ : ముగ్గురికి తీవ్ర గాయాలు

ఇల్లెందురూరల్: మండలంలోని బొజ్జాయిగూడెం గ్రామ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. టేకులపల్లి నుంచి కొమరం శ్రీను, అతని కుమార్తె హేమ బైక్‌పై ఇల్లెందుకు వస్తున్నారు. అదే సమయంలో ఇల్లెందు నుంచి మరో బైక్‌పై నరేష్ అనే వ్యక్తి కొత్తగూడెం వెళుతున్నాడు. రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అక్కడి వైద్యులు ఖమ్మం సిఫారసు చేశారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



నారాయణ మృతదేహం

అన్నపురెడ్డిపల్లి (చండ్రుగొండ) : అన్నపురెడ్డిపల్లిలో శుక్రవారం ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సంగసాని నారాయణ (45) తన ఇంటి పక్కనే ఉన్న చిట్టయ్య ఇంటి పెరట్లోని కొబ్బరిచెట్టు ఎక్కాడు. కాయలు కోసే క్రమంలో అడ్డువస్తున్న కొబ్బరి మట్టను నరికాడు. ఆ మట్ట విద్యుత్ తీగలపై పడి విద్యుదాఘాతానికి గురై చెట్టుపై నుంచి కిందపడ్డాడు. చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో ఎర్రగుంట పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యసిబ్బంది తెలిపారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.